

నేడు శంబర ఆలయ హుండీల లెక్కింపు

సాలూరు(మక్కువ), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): శంబర పోలమాంబ అమ్మవారి చదురుగుడి, వనంగుడిల వద్ద ఏర్పాటు చేసిన హుండీల ఆదాయాన్ని సోమవారం దేవదాయ శాఖాధికారులు, గ్రామ పెద్దల సమక్షంలో లెక్కించనున్నట్టు ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హుండీల లెక్కింపు కార్యక్రమంలో ఆసక్తి ఉన్న భక్తులు, సేవకులు పాల్గొనవచ్చునన్నారు. సోమవారం ఉదయం 9 గంటల సమయంలో అమ్మవారి చదురుగుడి వద్దకు హాజరు కావాలని కోరారు.

ముగిసిన కల్యాణ ఉత్సవాలు

- 12న వేంకటేశ్వరుని చక్రతీర్థ స్నానం

గరుగుబిల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): చినతిరుపతిగా ప్రసిద్ధి గాంచిన తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామ దేవస్థానాల్లో స్వామివార్ల కల్యాణ మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ నెల 5 నుంచి 8 వరకు నూతన విగ్రహ పునఃప్రతిష్ఠతో పాటు నూతన ఆలయాల ప్రారంభం అత్యంత వైభవంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఈ నెల 12న పవిత్ర నాగావళి నదీ తీరంలో వేంకటేశ్వర స్వామివారి శ్రీచూర్ణోత్సవం, శ్రీచక్ర తీర్థ స్నానం నిర్వహించనున్నట్ల దేవస్థానం ఈవో వీవీ సూర్యనారాయణ, తోటపల్లి దేవస్థానాల అభివృద్ధి సేవా ట్రస్టు అధ్యక్ష, కార్యదర్శులు డి.ధనుంజయరావు, డాక్టర్ డి.పారినాయుడులు తెలిపారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.



నూతన దేవస్థానం ఆవరణలో భక్తుల సందడి

నందివానివలసలో ఏనుగుల గుంపు

గరుగుబిల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఏనుగుల గుంపు ఆదివారం నందివానివలస సమీపంలోని తామర చెరువు వద్ద ప్రత్యక్షమైంది. కురుపాం నియోజకవర్గం పరిధిలోని కొమరాడ, జియ్యమ్మవలస, కురుపాం మండలాల్లో గత కొద్ది రోజులుగా ఏనుగులు సంచరిస్తున్నాయి. శని వారం జియ్యమ్మవలస మండలం సింగనాపురం, కుదమ గ్రామాల్లో సంచరించాయి. ఆదివారం గతంలో వచ్చిన తామర చెరువు ప్రాంతానికి మళ్లీ చేరుకున్నాయి. గత నాలుగేళ్లుగా తిరిగిన ప్రాంతాల్లోనే తిరుగుతూ రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ప్రస్తుతం నందివానివలసలో ఉన్న గజరాజుల గుంపు ఏ సమయంలో ప్రధాన రహదారులతో పాటు గ్రామాల్లోకి వస్తాయోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో అధికంగా సుంకి ప్రాంతంలో తిష్ఠ వేసి పంటలకు తీవ్ర నష్టం కలిగించాయి. అటవీ అధికారులు స్పందించి ఏనుగులు తమ గ్రామాల వైపు రాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నందివానివలస తామర చెరువులో ఉన్న ఏనుగులు

తోటపల్లి పనులకు మళ్లీ బ్రేక్



తోటపల్లి ఎడమ ప్రధాన కాలువ లైనింగ్ పనులు

తోటపల్లి పూర్వపు ఎడమ, కుడి కాలువల ఆధునికీకరణ పనులు మళ్లీ ఆగిపోయాయి. రాష్ట్రంలో 25 శాతం లోపు పనులు జరిగిన ప్రాజెక్టులను నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ జాబితాలో తోటపల్లి కూడా ఉంది. ఇప్పటి వరకు 23 శాతం మేరకే పనులు జరిగాయి. దీంతో కాలువల ఆధునికీకరణకు బ్రేక్‌లు పడ్డాయి. మళ్లీ ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా తోటపల్లి పనులు మాత్రం పూర్తికావడం లేదని వాపోతున్నారు. ఫలితంగా శివారు భూములకు సాగునీరు అందడం లేదని ఆవేదన చెందుతున్నారు. పనుల పూర్తికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- నిలిచిన కాలువల ఆధునికీకరణ
- ఆపేయాలని ప్రభుత్వం ఆదేశం
- 25 శాతం లోపు పనులు జరగడమే కారణం
- రైతుల్లో ఆందోళన
- ఎన్నో ఏళ్లుగా సాగునీటి కష్టాలు

పాలకొండ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి)

తోటపల్లి ఎడమ పూర్వపు ప్రధాన కాలువ పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలో 37.53 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఈ కాలువ ద్వారా మన్యం జిల్లాలోని గరుగుబిల్లి, జియ్యమ్మవలస, వీరఘట్టం, పాలకొండ మండలాలతో పాటు శ్రీకాకుళం జిల్లాలోని బూర్జ మండలంలోని సుమారు 40 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. అలాగే కుడి ప్రధాన కాలువ పార్వతీపురం, విజయనగరం జిల్లాల పరిధిలో 17.616 కిలోమీటర్లు విస్తరించి ఉంది. మన్యం జిల్లాలోని గరుగుబిల్లి, బలిజిపేట మండలాలతో పాటు విజయనగరం జిల్లాలోని వంగర మండలంలోని సుమారు 18 వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. గతంలో ఈ కాలువల ద్వారా పుష్కలంగా సాగునీరు అందేది. అయితే, కాలువలు నిర్మించి 120 ఏళ్లు కావడంతో ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో 2005లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తోటపల్లి ఆధునికీకరణకు శ్రీకారం చుట్టింది. అయితే, 20 ఏళ్లు అవుతున్నా ఇంకా పనులు 23 శాతానికే పరిమితమయ్యాయి. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా ఈ పనులు మాత్రం పూర్తికావడం లేదు. ఫలితంగా 7, 8 బ్రాంచిల్లోని శివారు మండలాలైన పాలకొండ, బూర్జ మండలాల రైతులకు సాగునీటి కష్టాలు తీవ్రతరమయ్యాయి. పూర్తిగా ధ్వంసమైన సైఫాన్లు, అక్విడెక్ట్‌లు, అండర్ టర్నల్స్, స్లూయిజ్‌లతో సాగునీరు అందడం లేదు. ప్రధాన కాలువ పరిధిలోని బ్రాంచి కాలువల ద్వారా రెగ్యులేటర్లకు సాగునీరు అందించే స్లూయిజ్‌లకు షట్టర్లు లేవు.



ఓని వద్ద అధ్వానంగా ఉన్న తోటపల్లి ఎడమ ప్రధాన కాలువ

ఎప్పటికి పూర్తవుతాయో?

35.36 కిలోమీటర్లు విస్తరించి ఉన్న తోటపల్లి ఎడమ పూర్వపు కాలువకు సంబంధించి ఇప్పటివరకు 17.532 కిలోమీటర్లు మా త్రమే లైనింగ్ పనులు పూర్తయ్యాయి. నర్సిపురం-మహదేవివలస మధ్య పెద్దురి గెడ్డపై అక్విడక్ట్, జె.గోపాలపురం గ్రామంలో (మిగతా 8వ పేజీలో..)

మళ్లీ మొదటికి..

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తోటపల్లి పూర్వపు కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణకు రూ.135 కోట్లు మంజూరయ్యాయి. పాలకొండ మండలం నవగాం వద్ద పనులకు శంకుస్థాపన చేశారు. పనులు సకాలంలో ప్రారంభించకపోవడంతో ఆ నిధులు వెనక్కి మళ్లాయి. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం రూ.195.34 కోట్లతో పనులు ప్రారంభించి 9 శాతం పూర్తి చేసింది. రూ.17 కోట్ల మేర కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 25 శాతం లోపు జరిగిన పనులను రివర్స్ టెండర్ పేరుతో నిలుపుదల చేసిన విషయం తెలిసిందే. దీంతో తోటపల్లి పనులు నిలిచిపోయాయి. ఈ పనులను కేటగిరి-డిలో పెట్టింది. రెండేళ్ల తర్వాత మళ్లీ పనులు చేపట్టేందుకు వైసీపీ ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. ఇప్పటివరు 23 శాతం మేర పనులు జరగ్గా కాంట్రాక్టర్‌కు రూ.34 కోట్ల బిల్లులు చెల్లించారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా 25 శాతం లోపు పనులు జరిగిన ప్రాజెక్టులను నిలిపివేయాలని నీటి పారుదలశాఖాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో మరోసారి తోటపల్లి పనులకు బ్రేక్‌లు పడ్డాయి. ఇలా పాలకులు మారిన ప్రతిసారి వర్క్‌లు ఆగిపోతున్నాయి. కాగా, 2018లో టెండర్ ఖరారైన నాటికి ప్రస్తుత ధరలకు వ్యత్యాసం ఉండడంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్ కూడా విముఖత వ్యక్తం చేస్తున్నాడు. దీంతో ఆధునికీకరణ పనుల కథ మళ్లీ మొదట కొచ్చింది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తోటపల్లి పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని రైతాంగం కోరుతుంది.



వెలగవాడ వద్ద షట్టర్ పరిస్థితి..

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తరాదు

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వేసవిలో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. గతంలోని అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ముఖ్యంగా గిరిశిఖరం ప్రాంతాల్లో తాగునీటి సమస్యను ఎదుర్కోవడా నికి అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. బోరు బావుల ఫ్లషింగ్, ఇతర నిర్వహణ పనులను ముందుగానే చేపట్టాలన్నారు. జలజీవన్ మిషన్ కింద అనేక ఆవాసాలకు తాగునీరు అందించామన్నారు. మిగిలిన వాటిపై దృష్టిపెట్టాలన్నారు. సమస్యను పరిష్కరించడానికి ఐటీడీఏలు కోటి రూపాయల వరకు నిధులు అందించాలన్నారు. వేసవి కాలం ప్రారంభమైందని, మే, జూన్ నెలల్లో భూగర్భజలాలు అడుగంటిపోవడం వంటి అంశాల కారణంగా నీటి ఎద్దడి ఎక్కువ ఉండే అవకాశముందన్నారు. సమ్మర్ క్రాష్ కార్య క్రమాన్ని మార్చి 15 వరకు చేపట్టాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ కమిషన్ ఆదేశాల మేరకు ఎంపీపీ నిధుల నుంచి రూ.75 లక్షలతో 15 మండలాల్లో మొత్తం 7,217 చేతి పంపుల మరమ్మతులు చేపట్టాలని అన్నారు. జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజనీరింగ్ అధికారి ఓ.ప్రభాకరరావు మాట్లాడుతూ.. మొత్తం 187 ఆవాసాల్లో తాగునీటి ఎద్దడి ఉన్నట్లు గుర్తించామని, ఇక్కడ సమస్య పరిష్కారానికి గాను గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.5.16 కోట్లతో అంచనాలు సిద్ధం చేశామన్నారు. జడ్పీ నిధులతో రూ.2.20 కోట్లతో 73 పనులు చేపట్టనున్నట్టు వివరించారు.



మాట్లాడుతున్న కలెక్టర్

లింక్ ఓపెన్ చేశాడు.. రూ.2.30 లక్షలు పోగొట్టుకున్నాడు..

- సైబర్ మోసానికి గురైన యువకుడు
- మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శంకరరావు

బెలగాం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు సైబర్ మోసానికి గురయ్యాడు. తన మొబైల్‌లో ఓ లింక్‌ని ఓపెన్ చేసి రూ.2.30లక్షలు పోగొట్టుకున్నాడు. దీంతో మన స్తాపానికి గురై పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్ప డ్డాడు. ఈ ఘటన పార్వతీపురం మండలం కోరి గ్రామంలో ఆది వారం చోటు చేసుకుంది. బాధితు డి భార్య పార్వతి తెలిపిన వివ రాల ప్రకారం.. కోరి గ్రామానికి చెందిన రాయల శంకరరావు వ్యవ సాయం చేస్తుంటాడు. మూడు రోజుల కిందట తన ఫోన్‌లో ఇన్‌స్ట్రాగ్రాం చూస్తుండగా ఓ వీడియో కనిపించింది. రూపాయి నోటును చూపించి ఇలాంటి నోటు ఎవరి దగ్గరైనా ఉంటే వారికి భారీగా నగదు వస్తుందని ఆ వీడియోలో ఉంది. దీంతో నోటు మీద ఉన్న లింక్‌ను శంకరరావు ఓపెన్ చేశా డు. వెంటనే అతనికి ఫోన్ కాల్ వచ్చింది. రూ. 1550 కడితే రూ.27లక్షలు వస్తాయని సైబర్ నేరాళ్లు ఆశ చూపి ఓ లింక్‌ని పంపించారు. దీంతో శంకరరావు వారు ఆ లింక్ ఓపెన్ చేసి ఓటీపీ చెప్పాడు. ఈ విధంగా పలు దఫాలుగా రూ.2.30 లక్షలు పోగొట్టుకున్నాడు. మోసపో యానని తెలుసుకున్న శంకరరావు మనస్తాపా నికి గురై గడ్డి మందు తాగి ఆత్మహత్యాయ త్నానికి పాల్పడ్డాడు. వెంటనే గమనించి జిల్లా ఆసుపత్రికి తీసుకొచ్చినట్లు పార్వతీ తెలిపింది. శంకర రావుకు చికిత్స అందిస్తున్నామని, 48 గంటల పాటు అబ్జర్వేషన్‌లో ఉంచామని డ్యూటీ డాక్టర్ చెప్పారు.

నులిపురుగులను నిర్మూలిద్దాం..
ఆరోగ్యాన్ని కాపాడుకుందాం..

- నేడు డీ వార్మింగ్ డే
- ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి సన్నద్ధం
- జిల్లాలో 1,36,612 మంది పిల్లలు



జిల్లాలో నులి పురుగుల నివారణ కార్యక్రమం విజయవంతం చేసేం దుకు వైద్య ఆరోగ్య శాఖ అన్ని ఏర్పాట్లు చేపట్టింది.

కొమరాడ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నులి పురుగుల నివారణ అనేది రక్తహీనత, పౌష్టికాహార లోపం, వ్యక్తిగత శుభ్రత వంటి అంశాలతో ముడిపడింది. ఇవి వినడానికి, చూడటానికి చిన్న సమస్యలుగానే కనిపిస్తున్నా వీటి వల్లే ఎదురయ్యే ముప్పు దీర్ఘకాలంలో పెద్దగానే ఉంటుంది. ఈ విషయాన్ని ఎవరూ పెద్దగా పట్టించుకోవడం లేదు. వీటి తీవ్రతపై అవగాహన ఉన్న వైద్య ఆరోగ్యశాఖ ప్రతి ఏడాదీ రెండు పర్యాయాలు నులి పురుగుల నివారణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నా తల్లిదండ్రుల్లో సరైన అవగాహన లేక భాగస్వామ్యం కావడం లేదు. పెద్దలు ఈ మాత్రలు వేసుకోకపోవడంతో పాటు పిల్లలతో వీటిని మింగించకుండా అవగాహన రాహిత్యంతో ఉంటున్నారు. సోమవారం సామూహిక నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్యశాఖ చేపడుతుంది. జిల్లాలోని 350 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 1,36,612 (1-19సంవత్సరాలు) పిల్లలు ఉన్నారు. ఇందులో 55,234 మంది అంగన్‌వాడీ చిన్నారులు ఉన్నారు. వీరికి ఆల్బెండజోల్ మాత్రలు వేసేందుకు గాను 3,845 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 37పీహెచ్‌సీలు, 5యూపీహెచ్‌సీల సిబ్బందితో పాటు అంగన్‌వాడీ, విద్యాశాఖ సిబ్బంది భాగస్వామ్యం కానున్నారు.

ఎలా వ్యాపిస్తాయంటే..

నులి పురుగులు సన్నటి దారం లాంటి ఆకారంలో ఉంటాయి. ఇవి మానవ శరీంలోని పేగుల గోడలను అంటి పెట్టుకుని ఉంటూ రక్తాన్ని పీలుస్తుంటాయి. మనం తీసుకునే ఆహారం నుంచి పోషకాలు, శక్తిని మన శరీరానికి అందకుండా చేస్తూ హాని కలిగిస్తాయి. ఇతర అవయవాలకు కూడా హాని కలిగిస్తాయి. అధిక శాతం కలుషిత ఆహారం తీసుకోవడం వల్ల, కలుషిత నీరు తాగడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం, బహిరంగ మల విసర్జన ద్వారా, భోజనం సిద్ధం చేసేటప్పుడు, వడ్డించేటప్పుడు, తినే ముందు, ఆహారం తీసుకున్న తరువాత చేతులు శుభ్రంగా కడగకపోవడంతో నులి పురుగులు మనిషి శరీరంలో వ్యాపిస్తాయి. చేతి వేళ్ల గోర్లు పెంచడం, కాళ్లకు చెప్పులు లేకుండా మరుగుదొడ్లకు వెళ్లడం, ఈగలు వాలిన తినుబండారాలు, దుమ్ము, దూళి ఎక్కువగా ఉండే వాతావరణంలో తయారు చేసిన ఆహార పదార్థాలు తీసుకోవడం, ఆకు కూరలు, కాయగూరలు, పండ్లు వంటివి శుభ్రంగా కడగకుండా తినడం ద్వారా మానవ శరీరంలోకి నులి పురుగులు సులువుగా ప్రవేశిస్తాయి. పెద్ద వాళ్ల కంటే పిల్లల ఆరోగ్యంపై నులి పురుగుల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. పిల్లలకు అందే పోషకాలను ఇవి తీసుకోవడం ద్వారా వారిలో ఎదుగుదల లోపం కనిపించడంతో పాటు ఇతర సమస్యలకు కారణమవుతాయి. రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి తగ్గడం, నీరసించడం, కడుపు నొప్పి, వాంతులు, విరోచనాలు, మలంలో రక్తం పడటం, మల మూత్ర విసర్జన ప్రదేశంలో దురదలు రావడం, బరువు తగ్గడం, దగ్గు, ఆయాసంతో పాటు జ్వరం, తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి.

నివారణ చర్యలు..

- భోజనానికి ముందు, తరువాత, మల విసర్జన తరువాత సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలి.
- ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ మాత్రలు 400 గ్రాముల చొప్పున వేసుకోవాలి.
- 1-2 ఏళ్లలోపు పిల్లలు 200 గ్రాముల మాత్ర వేసుకోవాలి.
- కచ్చితంగా భోజనం చేసిన తరువాత నమిలి లేదా చప్పరించి ఈ మాత్రలు కడుపులోకి పంపించాలి.
- మాత్రలు వేసుకునే ముందు కచ్చితంగా చేతులు శుభ్రం చేసుకోవాలి.

పౌష్టికాహారం తీసుకున్నా ఉపయోగం ఉండదు

చిన్న పిల్లల్లో నులి పురుగులు ఉంటే ఆరోగ్య సమస్యలతో పాటు ఎదుగుదల లోపిస్తుంది. తల్లిదండ్రులు చిన్నారులకు పౌష్టికాహారం అందించినా ఉపయోగం ఉండదు. మంచి ఆహారం ద్వారా వచ్చే శక్తినంతా నులి పురుగులే హరిస్తాయి. చిన్నగా ఉండే నులి పురుగులు పెద్దగా పెరిగి పిల్లలకు ఆహారం అందకుండా చేస్తాయి. చిన్న పిల్లల మలాన్ని ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు గమనించాలి. చిన్న చిన్న పురుగులు కనిపిస్తే వైద్యులను సంప్రదించి మాత్రలు వేయాలి. ముఖ్యంగా తొమ్మిదేళ్లలోపు పిల్లలందరూ తప్పకుండా వేసుకోవాలి.

-డాక్టర్ తెర్లి జగన్‌మోహనరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి

రోడ్డెక్కిన విద్యార్థులు

- రుచికరమైన భోజనం పెట్టడం లేదంటూ ఆందోళన
- సాలూరు బీసీ బాలుర కళాశాల వసతిగృహం వద్ద బైఠాయింపు

8లో

నిర్వహణ లేక.. వీధి దీపాలు వెలగక

- అంధకారంగా సీతంపేట
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

8లో

వైభవంగా సుగంధ మహోత్సవం

- భక్తులతో కిక్కిరిసిన దర్గా
- వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు
- నేడు ఉరుసు మహోత్సవాలు ముగింపు



పులి వేషాల సందడి

విజయనగరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సూఫీ సెహన్‌షా ఆధ్యాత్మిక చక్రవర్తి హుజూర్ హజరత్ సయ్యద్‌బాబా, ఖాదర్‌వలీ 66వ సుగంధ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు ఉరుసు ఉత్సవంలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఖాదర్‌బాబా దర్గాదర్బార్ జనసంద్రంతో నిండి పండుగ శోభను సంతరించుకుంది. ఖాదర్‌బాబా దివ్యసమాధికి చాదర్, అత్తర్, గులాబీలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు బాబా దర్గాని సందర్శించుకున్నారు. సూఫీ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైన ముఖ్యమైన ఈ ఘట్టంను చీమలపాడు అతావుల్లా షరీఫ్‌షా తాజ్ ఖాదరీబాబా దర్గాదర్బార్ పీఠాధిపతి సజ్జదా నసీన్ మహ్మద్‌ఖాజా మొయిద్దీన్, షరీఫ్‌షా తాజ్ ఖాదరీబాబా, విజయనగరం దర్గా దర్బార్ షరీఫ్ ముతావల్లి డాక్టర్ ఎండీ ఖలిలుల్లా షరీఫ్‌షా తాజ్ ఖాదరీబాబా ఆధ్వర్యంలో భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆచరించారు. ఆదివారం ఉదయం దర్బార్ లోని ఖాదరీ బాబా అనుశిక్త ప్రతిరూపంగా భావించే చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించిన హంసా వాహనంపై ఊరేగించారు. దర్బార్ నుంచి అబాద్‌వీధి, అంబటి సత్రం, మూడు లాంతర్లు మీదుగా నగర పురవీధుల్లో కన్నుల పండువగా ఊరేగింపు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేశారు. సోమవారంతో ఈ ఉత్సవాలు ముగియనున్నాయి. విజయనగరం డీఎస్పీ ఎం శ్రీనివాసరావు పర్యవేక్షణలో టూటౌన్ సీఐ శ్రీనివాసరావు, సిబ్బంది, పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



బాబా దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు



ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

మద్యం దుకాణాల లాటరీ వాయిదా

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ వాయిదా పడింది. ఎమ్మెల్సీ ఎన్నికల మోడల్ కోడ్ అమలులో ఉన్నందున వాయిదా పడినట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనాథుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమిషన్ అనుమతి వచ్చిన వెంటనే తదుపరి లాటరీ తేదీని ప్రకటిస్తామన్నారు.

●రాజాం: కల్లుగీత కులాలకు సంబంధించిన మద్యం దుకాణాల లాటరీ వాయిదా పడినట్టు ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.జైబీమ్ ఓ ప్రకటనలో తెలిపారు. జిలాలో ఎన్నిక కోడ్ అమలులో ఉన్నందున లాటరీ తేదీ వాయిదా పడిందని పేర్కొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వేపాడ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బక్కునాయుడుపేట గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఉషారాణి తెలిపారు. ఆసక్తి గలవారు మార్చి 6 లోపు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. గురుకుల పాఠశాలలో ఉచితంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించామన్నారు. విద్యార్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష మించని వారు దరఖాస్తులకు అర్హులన్నారు.

కథాలోగిలి పుస్తకావిష్కరణ

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గురజాడ కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం సహజ సాంస్కృతిక సంస్థ కథా లోగిలి పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. రచయిత గంటేడ గౌరీనాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాజాం రచయితల వేదిక అధ్యక్షుడు గార రంగనాథం పుస్తకాన్ని ఆవిష్కరించారు. రచయిత అల్లి మోహనరావు పరిచయం చేయగా, ముఖ్యఅతిథిగా విశాఖ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి అడపా రామకృష్ణ, మేడా బుజ్జెమ్మ, మేడా మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులి పురుగల దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లాలో ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు సుమారు 3 లక్షల మందికి అల్బెండ్‌జోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టరు జీవరాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మాత్రను నమిలి మింగాలన్నారు. పిల్లల్లో నులి పురుగులు నశించి రక్తహీనత రాకుండా కాపాడుతుందన్నారు. అంగన్‌వాడీలు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

శారదా నదిలో పడి విజయనగరం వాసి మృతి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం అనకాపల్లిలోని శారదా నదిలో ప్రమాదవశాత్తూ జారిపడి ఓ వృద్ధుడు మృతిచెందినట్టు ట్రైనీ డీఎస్పీ ఎంవీకే చైతన్య తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. విజయనగరానికి చెందిన షేక్ ఇస్మాయిల్ (63) శుక్రవారం సాయంత్రం అక్కడి నుంచి అనకాపల్లి పట్టణానికి ఆనుకొని ఉన్న దేవీనగర్‌లో నివాసముంటున్న చెల్లెలు తాజు ఇంటికి బస్సులో బయల్దేరారన్నారు. అనకాపల్లి వచ్చిన ఆయన శారదా నది ఒడ్డున శివాలయం సమీపంలో నదిలో దిగే సమయంలో ప్రమాదవశాత్తూ జారిపడిపోయి మృతిచెంది ఉంటారని భావిస్తున్నట్టు చెప్పారు. ఆదివారం ఉదయం నదిలో మృతదేహం తేలి ఉండడాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారన్నారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

దివ్యాంగుడికి సత్కారం

రాజాం రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పెనుబాక గ్రామానికి చెందిన దివ్యాంగ కళాకారుడు భుజంగరావును వరంగల్ జిల్లా హనుమకొండలో ఆదివారం ఘనంగా సత్కరించారు. హనుమకొండలోని డా.బి.ఆర్.అంబేద్కర్ భవన్‌లో విద్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల దివ్యాంగ కళాకారులచే నిర్వహించిన సాంస్కృతిక ఉత్సవంలో భుజంగరావు డాన్స్ చేసి అందరి మన్ననలు పొందాడు.

విజిబుల్ పోలీసింగ్‌తో నేరాల కట్టడి

● ఎస్పీ వకుల్ జిందాల్



ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలీసు అధికారులు, సిబ్బంది నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఒక ప్రకటనలో తెలిపారు. నేరాలు తగ్గుముఖం పట్టేందుకు విజిబుల్ పోలీసింగ్ ప్రధాన భూమిక పోషిస్తుందన్నారు. ప్రజలు, యువత, వాహనదారులకు, రహదారి భద్రత, మహిళల భద్రత, సైబర్, మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పించాలన్నారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలు చేపడితే ఎటువంటి శిక్షలు ఉంటాయో వివరించాలన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే ఊపేక్షించవద్దని ఆదేశించారు. స్టేషన్ పరిధిలోని హిస్టరీ షీట్ వ్యక్తులను వారంలో ఒకసారి పిలిపించి సత్ప్రవర్తనతో వారు జీవించే విధంగా కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు రక్షణగా నిలిచే చట్టాలపై సైబర్ మోసగాళ్లు అవలంబించే విధానాలను వివరించి అప్రమత్తం చేయాలని ఎస్పీ ఆదేశించారు.

అమ్మవారి జాతరకు పందిరిరాట



పందిరిరాటను వేస్తున్న దృశ్యం

చీపురుపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 2, 3, 4 తేదీల్లో చీపురుపల్లిలో జరగనున్న కనకమహలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవాలకు ఆదివారం పందిరి రాట వేశారు. అమ్మవారి ఆలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రౌతు కామునాయుడు, నిర్వహణ కమిటీ ప్రతినిధి గవిడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బి. శ్రీనివాస్, అర్చకులు ఆరవిల్లి రవికుమార్, నాయకులు ఎన్వీ కామేశ్వరరావు, గవిడి వాసు, లెంక చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

జొన్నవలసలో రాజేశ్‌వర్మ జన్మదిన వేడుకలు



రాజేశ్‌వర్మతో టీడీపీ నాయకులు

విజయనగరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవలసలోని నివాసంలో టీడీపీ జిల్లా కార్యాలయం కార్యదర్శి పూసపాటి రాజేశ్‌వర్మ జన్మదిన వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నగర, మండల నాయకులు రాజేశ్‌వర్మతో కేక్‌కట్ చేయించారు. అంతకుముందు ఆయన జిల్లా పార్టీ కార్యాలయంలో సీనియర్ నేత కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతి రాజును కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. విజయనగరం ఎమ్మెల్యే అతిది గజపతిరాజు ఫోన్‌లో రాజేశ్‌వర్మకు శుభాకాంక్షలు తెలియజేశారు. వీరితో పాటు టీడీపీ నాయకులు ఆయనకు వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా, బొకేలు పుస్తకాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పినమేవలి వృద్ధాశ్రమంలో రాజేశ్‌వర్మ అభిమానులు వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.

గణితం క్విజ్ పోటీల్లో లక్ష్మీపురం విజేత



గణితం క్విజ్ పోటీలో విజేతలు వీరే..

రేగిడి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో సంకిలి హైస్కూల్‌లో ఆదివారం సిక్కోలు గణిత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మండల స్థాయి గణిత క్విజ్ పోటీలు నిర్వహించారు. 6, 7 తరగతుల వారికి నిర్వహించిన పోటీల్లో లక్ష్మీపురం హైస్కూల్ విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచారు. రేగిడి హైస్కూల్, అంబఖండి హైస్కూల్ వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు సంకిలి హైస్కూల్ హెచ్‌ఎం రామినాయుడు, గణిత ఉపాధ్యాయులు హరిబాబు, కృష్ణంరాజు, రవికిరణ్, ప్రసాద్, హిందీ ఉపాధ్యాయుడు గణపతిరావు బహుమతులు ప్రదానం చేశారు.

టంకాల కుటుంబానికి పరామర్శ

రేగిడి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో చిన్నశిర్లాం సీనియర్ టీడీపీ నేత టంకాల గోవిందరావు ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకట్రావు ఆదివారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ మంచి కార్యకర్తను కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. కళా వెంట టీడీపీ నేత కె.మహేష్, గోవిందరావు ఉన్నారు.

కళాను కలిసిన ఎంపీ కలిశెట్టి



కళాతో మాట్లాడుతున్న కలిశెట్టి

రాజాం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావును విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కిమిడి సోదరుడు కిమిడి సత్యనారాయణ నాయుడు ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో కళాను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు అనంతరం రాజకీయాలపై చర్చించుకున్నారు.

బాధితులకు కలిశెట్టి పరామర్శ

దత్తిరాజేరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదమానాపురం రైల్వే లైన్ బాధితులను ఆదివారం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పరామర్శించారు. బాధితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. 28 మంది బాధితులు ఎటువంటి ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు.

అవినీతిపరులకు గుణపాఠం: గద్దె

చీపురుపల్లి, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): 2024లో ఏపీలో ఎన్నికల ఫలితాలు, ఇటీవల వెలువడిన ఢిల్లీ ఎన్నికల ఫలితాలు అవినితిపరులకు గుణపాఠం కలిగించేవిగా ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల కోసం పనిచేయని పార్టీలకు ప్రజలు తగిన శాస్తి చేశారన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మోదీ నాయకత్వానికి అక్కడి ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. మద్యం కుంభకోణంలో కేజ్రీవాల్‌ని అరెస్టు చేయడం సరైన చర్య అని ప్రజలు తీర్పు ఇచ్చారన్నారు. మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అన్నిరంగాల్లో ముందుకు దూసుకుపోతోందన్నారు. మోదీ ప్రభుత్వంపై ఎటువంటి అవినీతి ఆరోపణలు లేవన్నారు. కూటమితో జత కట్టిన తరువాత మన రాష్ట్ర పరిస్థితి కూడా మారిపోయిందని బాబురావు పేర్కొన్నారు.

ఘనంగా వివేకానందస్వామి తీర్థం



బండ్ల పరుగు పోటీలో దౌడు తీస్తున్న ఎడ్లు

వేపాడ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకులసీతంపేటలో ఆది వారం రెండోరోజు వివేకానందస్వామి తీర్థమహోత్సవం ఘనంగా నిర్వహించారు. తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకుని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మంచిన అప్పలసూరి సౌజన్యంతో నిర్వహిం చిన కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. మధ్యాహ్నం నిర్వహించిన ఎడ్ల బం డ్ల పరుగు పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చై ర్మన్ రామునాయుడు, సర్పంచ్ రమణమ్మ, మాజీ సర్పంచ్ అప్పలసూరి, ఎంపీ టీసి సభ్యుడు అడపా ఈశ్వరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సందడిగా ఫోర్టుసిటీ వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థిని

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఫోర్టుసిటీ పాఠశాలలో 13వ వార్షికోత్సవాన్ని రెండోరోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ ప్రధాన అంశంగా విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు, నృత్యాలు అందరినీ అలరించాయి. ఈసందర్భంగా స్కూల్ ఛైర్మన్ కేఏపీ రాజు మాట్లాడుతూ తమ విద్యార్థులకు విద్యతో పాటు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వైజ్ఞానిక ప్రదర్శనలకు అధిక ప్రాధాన్యనిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్కూల్ వైస్ ఛైర్మన్ చంటి, ప్రిన్సిపాల్ రేయినా ఖాన్, డైరెక్టర్లు మధు, నీలిమ, అశోక్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆదిత్యుడి సేవలో నెల్లిమర్ల ఎమ్మెల్యే



స్వామివారి జ్ఞాపికను అందజేస్తున్న అర్చకుడు

అరసవల్లి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ (ఆదిత్యుడు) స్వామివారిని విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే లోకం మాధవి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా.. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అర్చకులు ఇప్పిలి సాందీపశర్మ వారికి స్వామివారి జ్ఞాపికను అందజేశారు.

జీడి మామిడికి మంచు దెబ్బ

● విజృంభిస్తున్న తెగుళ్లు ● ఆందోళనలో రైతులు

రాజాం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): చిగురు, పూత దశలోని జీడి మామిడి తోటలపై పొగ మంచు తీవ్ర ప్రభావం చూపుతోంది. ఏటా ఈ సీజన్లో మంచు ప్రభావం సాధారణమేనైనా ఎన్నడు లేనంతగా కొద్ది రోజులుగా మంచు కురుస్తోంది. ఫలితంగా పూత రావడం లేదని, కొన్నిచోట్ల వచ్చిన పూత మాడిపోయి మొండి రెమ్మలు దర్శనమిస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లాల్లో సుమారుగా 3 వేల ఎకరాల వరకు మామిడి, 4 వేల ఎకరాల వరకు జీడి సాగవుతోంది. కళ్ల మందే మాడిపోతున్న పూతను చూసి రైతులు లబోదిబోమంటున్నారు. ఈ ఏడాది కూడా నష్టం తప్పదని రైతులు తలలు పట్టుకుంటున్నారు.



మంచుతో మాడిపోతున్న మామిడి పూత

క్రైం న్యూస్

వివాహిత ఆత్మహత్య

గుమ్మలక్ష్మీపురం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురం శివారులో గల తమ సొంత తోటలో వివాహిత జన్ని రజని(32 అనుమానాస్పద స్థితిలో చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందింది. వివాహిత భర్త ఉదయ్‌కుమార్ పార్వతీపురం మన్యం కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూశాఖ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. వివాహిత మరణించిన ప్రదేశంలో గుళికల మందును పోలీసులు గుర్తించారు. రజని మరణం హత్యా.. ఆత్మహత్య అనే కోణంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎల్విన్‌పేట ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించామని చెప్పారు. ఎల్విన్‌పేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

భోగాపురం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలం సవరవల్లి సమీప జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారని ఏఎస్‌ఐ తవుడు తెలిపారు. పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం కుశాలపురానికి చెందిన యాగంటి కృష్ణారావు ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. తన యజమానిని తీసుకువచ్చేందుకు వాహనంపై డ్రైవర్ రమేశ్‌తో కలిసి శనివారం రాత్రి విశాఖ రైల్వే స్టేషన్‌కు వెళ్లారు. యజమానిని వాహనం ఎక్కించుకుని తిరిగి విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న సమయంలో సవరవల్లి సమీపంలో ముందు వెళ్తున్న లారీని తప్పించబోయి వాహనం డివైడర్‌ను ఢీకొంది. దాంతో కృష్ణారావుకు తీవ్రగాయాలయ్యాయి. డ్రైవర్ రమేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరు శ్రీకాకుళంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ తవుడు తెలిపారు.

మద్యం సీసాలతో ఇద్దరి అరెస్టు

నెల్లిమర్ల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల మండలం కొండవెలగాడ, గుర్ల మండలం గోషాడ జంక్షన్ ప్రాంతాల్లో ఆదివారం చేపట్టిన దాడుల్లో మద్యం బాటిళ్లతో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామని ఎక్సైజ్ సీఐ ఎం.వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొండవెలగాడలో పట్టుబడిన వ్యక్తి నుంచి 7 మద్య సీసాలను, గోషాడలో పట్టుబడిన వ్యక్తి నుంచి 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

18 మందిపై కేసు నమోదు

రాజాం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మద్యం బెల్ట్ దుకాణాలు నియంత్రణ చర్యల్లో భాగంగా జనవరి నుంచి ఫిబ్రవరి 9 వరకు నిర్వహించిన దాడుల్లో 18 మందిపై కేసులు నమోదు చేసి, వారి నుంచి 176 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఆర్.జైబీమ్ ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా మద్యం బెల్ట్ దుకాణాలు నిర్వహించినా, దుకాణాల నిర్వహణకు వేలం పాటలు నిర్వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి..

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల మండలం సతివాడలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న బి.కంచెయ్యను ఆదివారం అరెస్టు చేసి అతడి నుంచి 9 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఇందిరాదేవి తెలిపారు. తదుపరి చర్యలు నిమిత్తం ప్రొహిబిషన్ ఎక్సైజ్ నెల్లిమర్ల స్టేషన్‌కు అప్పగించామన్నారు. దాడుల్లో ఎస్‌ఐ రాజశ్రీ, హెచ్‌సీ నాగేశ్వరరావు, ఈసీలు నాయుడు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ దుకాణాలపై దాడి..

భోగాపురం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెపువలసలో నిర్వహిస్తున్న మద్య బెల్ట్ దుకాణంపై దాడి చేసి అదే గ్రామానికి చెందిన మహిళను ఆదివారం అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ వి.రవికుమార్ తెలిపారు. అక్రమంగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు దాడి చేసి 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తిని అరెస్టు చేసినట్టు తెలిపారు. అలాగే ఎన్నికల కోడ్ కారణంగా ఈనెల 10న కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన మద్యం దుకాణాల వేలం వాయిదా వేసినట్టు సీఐ తెలిపారు.

చెరకు లారీ బోల్తా: ట్రాఫిక్ జామ్

రేగిడి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో బూరాడ-కొర్లవలస మధ్య ఆదివారం సాయంత్రం చెరకు లారీ బోల్తా పడింది. ఈ ఘటనలో పాలకొండ-రాజాం రూట్‌లో గంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రాజాం నుంచి సంకిలి సుగర్ ఫ్యాక్టరీకి వస్తున్న లారీ ఓవర్ లోడ్ వచ్చి ఒకవైపు ఒరగటంతో ఈ ప్రమాదం చోటు చేసుకొంది. ఎలాంటి హాని జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. రేగిడి పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



సరుకులు అందజేస్తున్న మారుతీ ప్రతినిధులు

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కణపాక ఆగురువీధిలోని ఆదివారం మారుతీ స్వయం సేవాసంఘం ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసక సరుకుల పంపిణీ కార్యక్రమం జరిగింది. దాదాపు 50 మందికి నెలకు సరిపడే సరుకులను అందజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు గుత్తూరు చంద్రశేఖర్, అరసాడ అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు. ● నగరంలోని దాసన్నపేటలో నవాబుపేట రామమందిరం వద్ద గోకుల కృష్ణ సేవాసంఘం ఆధ్వర్యంలో 50 మంది నిరుపేదలకు 5 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. గార కృష్ణమ్మ జ్ఞాపకార్థం ఆమె కుటుంబసభ్యులు బియ్యాన్ని సమకూర్చారు.

ప్రజ్ఞా వికాసం పరీక్ష విజయవంతం

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా టెన్త్ విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ఎయిమ్స్ కాన్సెఫ్ట్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ప్రజ్ఞా వికాసం మోడల్ టెస్ట్ విజయవంతమైంది. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు రామ్మోహన్, వెంకటేశ్, రాము పాల్గొన్నారు.

●రాజాం: రాజాం పట్టణంలో ఆదివారం టెన్త్ విద్యార్థులకు ప్రజ్ఞా వికాసం పేరిట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మోడల్ టెస్ట్ జరిగింది. అధికసంఖ్యలో విద్యార్థులు పరీక్షలో పాల్గొన్నారు. పరీక్షను ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పి.రమేశ్, జిల్లా కమిటీ కో-గర్ల్ కన్వీనర్ బి.రూప పర్యవేక్షించారు. కార్యక్రమంలో రాజాం నాయకులు షన్ముఖ, అబి, శ్రీరామ్, సత్యనారాయణ, ధనుంజయ్ పాల్గొన్నారు.

ముగిసిన హిందీ పరీక్షలు

రాజాం రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత హిందీ ప్రచారసభ ఆధ్వర్యంలో రెండురోజులుగా రాజాంలో నిర్వహిస్తున్న హిందీ పరీక్షలు ఆదివారంతో ముగిశాయని హిందీ ప్రచారక్ కొండవలస మధుసూదనరావు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక, మధ్యమ, రాష్ట్రభాష, ప్రవేశిక, విశారద, ప్రవీణ పరీక్షలకు 212 మందికి గాను 210 మంది హాజరయ్యారని తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్ ఎ.మహేశ్వరావు సారథ్యంలో నిర్వహించిన పరీక్షలకు రాజాం, రేగిడి, వంగర, జి.సిగడాం, పొందూరు, తెర్లాం, చీపురుపల్లి మండలాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఎంఈవో దుర్గారావు పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారని మధుసూదనరావు తెలిపారు.

40 యూనిట్ల రక్తం సేకరణ

దత్తిరాజేరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుల రామచంద్రాపురంలో ఆదివారం అమ్మ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటైంది. ముఖ్యఅతిథిగా అభ్యుదయ ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ చింతల శారద హాజరయ్యారు.కార్యక్రమంలో సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు సాయి కుమార్, అమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు, ఎస్వీఎస్ బ్లడ్ బ్యాంకు మేనేజర్ నాగేశ్వరరావు, రాజుల రామచంద్రపురం గ్రామపెద్దలు శివరామరాజు, శ్రీనివాసరాజు, కృష్ణంరాజు, తిరుపతిరావు, గౌరినాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 40 యూనిట్ల రక్తాన్ని సేకరించారు.

కార్యకర్తలపై వివక్ష సహించం

పూసపాటిరేగ, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తలపై వివక్ష చూపితే సహించేదిలేదని వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ప్రజాప్రతినిధులు ఆదివారం సీఐ రామకృష్ణ, ఎస్ఐ దుర్గాప్రసాద్‌తో అన్నారు. పలు కేసులో వెసీపీ క్యాడర్‌పై పక్షపాత వైఖరి చూపడం తగదన్నారు.

కంకర వేశారు.. తారు మరిచారు

● ఇదీ బొబ్బిలి - శంబర రోడ్డులో పరిస్థితి



బొబ్బిలి –దిబ్బగుడ్డివలస రహదారిలో రాళ్లు తేలిన దృశ్యం

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి నుంచి దిబ్బగుడ్డివలస, మక్కువ, శంబర వెళ్లే రోడ్డు పనుల్లో భాగం గా కంకర వేసి తారు వేయడం మరిచి పోయారు. శంబర పం డగ నేపథ్యంలో సంక్రాంతికల్లా రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయా లని బొబ్బిలి నుంచి దిబ్బగుడ్డి వలస, మక్కువ, శంబర వెళ్లే రోడ్డు గోతులు కప్పడానికి, రహ దారి నిర్మాణానికి నిధులు మం జూరయ్యాయి. అయితే కంకర పోసి నెలలు గడుస్తున్నా తారు వేయకపోవడంతో ప్రయాణికులు, వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. కాగా ఇంకా బిల్లులు చెల్లించలేదని, పరిశీలించి పనులు పూర్తిచేస్తామని రహదారుల ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

కార్మికుల సంక్షేమంపై దాటవేత ధోరణి తగదు



మాట్లాడుతున్న కార్మిక నాయకులు

బొబ్బిలి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమంపై కేంద్ర ప్రభుత్వం దాటవేత ధోరణి అనుసరించడం తగదని ఈపీఎఫ్ పెన్షన్ దారుల సంఘం జిల్లా నాయకుడు పి.శంకరరావు కోరారు. ఆదివారం బొబ్బిలిలో విలేక రులతో మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఈపీఎఫ్ పెన్షన్ దారులకు జరిగిన అన్యా యానికి నిరసనగా మంగళవారం విజయన గరం పీఎఫ్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తామని తెలిపారు. కనీసపెన్షన్ రూ. 900 ప్రకటిం చాలని, ఉచిత వైద్యం, రైలు ప్రయాణంలో రాయితీ కల్పించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా 78 లక్షల మంది ఈపీఎఫ్ పెన్షన్‌దారులకు కేంద్ర ప్రభుత్వం మొండిచెయి చూపడం అన్యాయమన్నారు. సామాజిక పెన్షన్ కన్నా తక్కువ మొత్తంలో అంది స్తుండడం దుర్మార్గమన్నారు. సమావేశంలో వి.శేషగిరి, టీబీ అప్పారావు, ఎం.శంకరరావు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల వినియోగంపై అవగాహన

గరుగుబిల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నులిపురుగు మందులు(ఆల్బెండజోల్ మాత్రలు) విని యోగంపై సిబ్బందికి వైద్యాధికారి కేకే సాగర్‌వర్మ అవగాహన కల్పించా రు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. సోమవారం నిర్వ హించనున్న డీవార్మింగ్ కార్యక్రమంలో సిబ్బంది హాజరై ఏడాది నుంచి 19 ఏళ్లలోపు వయస్సు ఉన్న వారికి ఆల్బెండజోల్ మాత్రలను అందించాలన్నారు.

గిరిజనులపై దౌర్జన్యం ఆపాలి



నిరసన తెలుపుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

సాలూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్ర జ్యోతి): గిరిజనులపై ఒడిశా ప్రభుత్వం దౌర్జన్యం ఆపాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ కార్యదర్శి గెమ్మెల జానకి డిమాండ్ చేశారు.ఆదివారం దులిభద్ర గ్రామంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొఠియా సరిహద్దు గ్రా మాల గిరిజనులపై ఒడిశా ప్రభుత్వం వేధింపులకు దిగడం సరికాదన్నా రు.అభివృద్ధి పనులు సామగ్రిని తీసుకుని వెళ్లడం, గిరిజన కూలీలను నిర్బంధించడం సరికాదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహా య కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకు లు తాడంగి సన్నం, చోడిపల్లి రాజు, సుబ్బారావు, బిరుసు పాల్గొన్నారు.

గిరిజనుల భాగస్వామ్యంతోనే పర్యాటకాభివృద్ధి

గుమ్మలక్ష్మీపురం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ గిరిజన ప్రాంతంలో గిరిజనుల భాగస్వామ్యంతోనే పర్యాటక అభివృద్ధి చేపట్టాలని ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు అభిప్రాయపడ్డారు. ఆదివారం గుమ్మలక్ష్మీపురంలో విలేకరులతో మాట్లాడుతూ 1/70 చట్టం గిరిజనులకు ఎంతగానో మేలు చేస్తుందని, ఈ చట్టాన్ని పూర్తిగా అమలు చేస్తూ పర్యాటకంగా అభివృద్ధి చేపట్టాలన్నారు.

● కురుపాం, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): గిరిజనులు మరింత ఆర్థి కంగా అభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తానని ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు అన్నారు. మంత్రజోల గ్రామంలో ఉన్న వన్‌ధన్ వికా స కేంద్రాన్ని పరిశీలించారు.

● గరుగుబిల్లి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తోటపల్లి వేంకటేశ్వర, కోదం డరామస్వామి దేవస్థానా లకు పూర్వ వైభవం సంతరించుకుందని ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు తెలిపారు. నూతనంగా నిర్మించిన దేవాలయాలను ఆయన ఆదివారం పరిశీలించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ పారినాయుడు, దుర్గారావు, మోనంగి ప్రకాశరావు పాల్గొన్నారు.

తోటపల్లి పనులకు మళ్లీ బ్రేక్

(ఐదో పేజీ తరువాయి)

ఎస్ఎల్ఆర్‌బీ, వీరఘట్టం, రాజపురం మధ్య బ్రిడ్జి, రాజపురం వద్ద బ్రిడ్జి (డీఎల్ఆర్‌బీ), కత్తులకవిటిలో వంతెన (ఎస్ఎల్ఆర్‌బీ) నిర్మించారు. అలాగే 17.616 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న కుడి ప్రధాన కాలువకు సంబంధించి ఇప్పటివరకు 9.372 కిలోమీటర్ల మేర మాత్రమే లైనింగ్ పనులు పూర్తి చేశారు. ఇంకా కుడి, ఎడమ కాలువల పరిధిలో 420 పను లు చేపట్టాల్సిఉంది. వీటిలో ప్రధానంగా సైఫాన్స్, ఆక్విడెక్ట్‌లు, బ్రిడ్జిలు, అం డర్‌టన్నల్స్, స్లూయిజలు నిర్మించడంతో పాటు షట్టర్లు బిగించాల్సి ఉంది. ఈ పనులన్నీ ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

పనులు పూర్తి చేయాలి..



తోటపల్లి ఎడమ, కుడి పూర్వపు కాలువల ఆధునికీకరణ పనులు పూర్తి చేయాలి. అప్పుడే శివారు రైతాంగానికి సాగునీటి కష్టాలు తీరుతాయి. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా పనులు మాత్రం పూర్తి చేయడం లేదు. కూట మి ప్రభుత్వమైనా స్పందించి పనుల వేగవంతానికి చర్యలు తీసుకోవాలి.

- ఖండాపు ప్రసాదరావు, అభ్యుదయ రైతు, పీఆర్‌రాజుపేట

నిలుపుదల చేశాం..

తోటపల్లి కాలువల ఆధునికీకరణ పనులు 23శాతం మాత్రమే జరిగాయి. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు పనులను నిలుపుదల చేశాం. దీనిపై కాంట్రాక్టర్‌కు సమాచారం అందించాం. ప్రభుత్వ ఆదేశాలతో మళ్లీ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

-శంకరరావు, జేఈఈ,
నీటిపారుదల శాఖ, పాలకొండ

నిర్వహణ లేక.. విద్యుత్ దీపాలు వెలగక

● అంధకారంగా సీతంపేట

● పట్టించుకోని పంచాయతీ అధికారులు

సీతంపేట రూరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సీతంపేట గ్రామంలో కారుచీకట్లు కమ్ముకున్నాయి. సుందర సీతంపేటలో భాగంగా ఐటీడీఏ ఆధ్వర్యంలో గ్రామంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రత్యేక నిధులు వెచ్చించి సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. అయితే వీటి నిర్వహణను పంచాయతీ అధికారులు విస్మరించారు. దీంతో విద్యుత్ దీపాలు సరిగ్గా వెలగడం లేదు. దీంతో గ్రామంలో అంధకారం అలముకుంటోంది. ఈ సెంట్రల్ లైట్లు ఒక రోజు వెలిగితే ఒకరోజు వెలగని పరిస్థితి ఉంది. నిర్వహణ లోపం కారణంగా మరికొన్ని లైట్లు మరమ్మతులకు గురయ్యాయి. సాయంత్రం అయితే గ్రామం అంధకారంగా మారుతోందని, ఇబ్బందిపడుతున్నామని సీతంపేట వాసులు వాపోతున్నారు.

పీవో దృష్టికి తీసుకు వెళ్తాం

ఇటీవల ఎంసీపీలను మరమ్మతులు చేయించాం. అయినప్పటికీ విద్యుత్ దీపాలు సరిగ్గా వెలగడం లేదు. దీనిపై ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకువెళ్లి సరి చేయిస్తాం.

- రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి, సీతంపేట

వెలగని విద్యుత్ దీపాలు



రోడ్డెక్కిన విద్యార్థులు

● రుచికరమైన భోజనం పెట్టడం లేదంటూ ఆందోళన

● సాలూరు బీసీ బాలుర కళాశాల వసతిగృహం వద్ద బైఠాయింపు

సాలూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి):తమకు మూడు రోజుల నుంచి రుచికరమైన భోజ నం పెట్టడం లేదని పట్టణంలోని బంగారమ్మకాలనీలో ఉన్న బీసీ బాలుర కళాశాల వసతి గృహం విద్యార్థులు రోడ్డెక్కారు.ఆదివారం రాత్రి వసతిగృహం వద్ద ప్లేట్లు పట్టుకుని నిరస న చేపట్టారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు అఖిల్ మాట్లాడుతూ మూడు రోజుల నుంచి జవ లాంటి అన్నంపెడుతున్నారని, దీంతో రోడ్డెక్కాల్సి వచ్చిందని తెలిపా రు.ఎంత ప్రశ్నించినా వర్కర్లు, వార్డెన్ సమాధానం చెప్పడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

లక్ష్యంతో పనిచేయాలి: బొత్స

బొబ్బిలి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తోటివారికి సహాయపడాలన్న లక్ష్యంతో పని చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ కోరారు. ఆదివారం బొబ్బిలి అప్పయ్యపేటరోడ్డులో తూర్పుకాపు సామాజికవర్గ ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ సామాజిక వర్గంలో లేనివాడిని ఉన్నవాడు ప్రోత్సహిస్తూ అందరి ఎదుగుదలకు కృషి చేయా లన్నారు. తూర్పుకాపు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్విని మాట్లాడుతూ ఎవరికి ఎటువంటి సమస్య వచ్చినా పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. కుల పెద్దలు రౌతు రామ్మూర్తి, లంక రమేష్, బొత్స అప్పులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, చోడిగంజి రమేష్‌నాయుడు, గురాన అయ్యలు, డాక్టర్ రెడ్డి రవికుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవాలి

● ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు



మాట్లాడుతున్న జేసీ రాజు

బొబ్బిలి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యారంగాన్ని, పాఠశాలలను రక్షిం చుకో వాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనరు జేసీ రాజు పిలుపునిచ్చారు. ఆ బాధ్యత మనందరిపై ఉందని, ఇందుకోసం తల్లి దండ్రుల సహకారంతో పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. ఆదివారం బొబ్బిలి ఎన్‌జీవో హోంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో-117 రద్దుకు సంబంధించి ప్రభుత్వం అస్పష్టమైన వైఖరిని అవలంబిస్తోందని ఆరో పించారు. జీవో- 117 రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో మోడల్, ఫౌండేషన్ స్కూల్స్‌గానో మార్చుతామనడం సరికాదన్నారు. ఫౌండేషన్ పాఠశాల వ్యవస్థను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. 12 వ వేతన సంఘాన్ని నియమించాలని డిమాండ్ చేశారు.సమావేశంలో జోగినాయుడు, ప్రవీణ్‌కుమార్,నాగేశ్వరరావు, శ్రీను, ఎల్లయ్య, దర్శనం పాల్గొన్నారు.

నేటి నుంచి దివ్యాంగ పింఛన్ల పరిశీలన

గరుగుబిల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పంచాయతీల పరిధిలో దివ్యాంగ పింఛన్లు పొందుతున్న దివ్యాంగుల ధ్రువపత్రాలను సోమవారం నుంచి పరిశీలిస్తామని ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. ఆదివారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రావుపల్లిలో 12 మంది, రావివలసలో 55 మంది, నాగూరులో 51, పెద్దూరులో 48, ఉద్దవోలులో 41, గొట్టివలసలో 37, కొత్తూరులో 34, ఉల్లిభద్రలో 33, తోటపల్లిలో 30, చినగుడబలో 29, సంతోషపురంలో 27, రాయిందొరవలసలో 26, గరుగుబిల్లిలో 25 మంది దివ్యాంగ పింఛన్లు పొందుతున్నారన్నారు. మొత్తంపై 508 మందికి గాను ఈనెల 10 నుంచి 25వ తేదీ వరకు పాలకొండ ఏరియా ఆసుపత్రిలో దివ్యాంగులతో పాటు ధ్రువీకరణ పత్రాలను వైద్య బృందం తనిఖీ చేస్తుందని తెలిపారు. సంబంధిత సచివాలయాల పరిధిలోని వెల్ఫేర్ అసిస్టెంట్లు తనిఖీలకు హాజరయ్యే విధంగా దృష్టి సారించాలన్నారు. లాకోమెటర్, ఆర్థోకు సంబంధించిన వారికి పాలకొండ కేటాయించారని తెలిపారు.

చినభోగిలి రహదారికి మోక్షం

సాలూరు(మక్కువ), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మక్కువ నుంచి చినబోగిలి వెళ్లే రహదారికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. సుమారు రూ.37కోట్లు నిధులు మంజూరు కావడంతో రహదారి పనులు ప్రారంభమయ్యాయి. గత కొన్నేళ్లగా ఈ రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని మరమ్మతులకు గురయ్యింది. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో రహదారి పనులు ప్రారంభించినా బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలేశాడు. ప్రస్తుతం ప్రభుత్వ ఆదేశాలతో కాంట్రాక్టర్ పనులను వేగవంతం చేశారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే మక్కువ నుంచి జిల్లా కేంద్రం పార్వతీపురం చేరుకునేందుకు ప్రజలు ఇబ్బందులు తొలగనున్నాయి. కూటమి ప్రభుత్వం చొరవతో రహదారి నిర్మాణం జరుగుతుండడం పట్ల ప్రజలు కూటమి ప్రభుత్వంపై హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

సెలవు రోజుల్లోనూ మధ్యాహ్న భోజనం



పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థినులు

వీరఘట్టం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సెలవు రోజుల్లో కూడా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వారికి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అందజేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. మండలంలో పది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 475 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ఈ సంవత్సరం నుంచి ప్రభుత్వ ఆదేశాలు మేరకు సెలవు రోజుల్లో నిర్వహించే ప్రత్యేక తరగతులకు వచ్చే విద్యా ర్థులకు మధ్యాహ్న భోజనం అందించడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నా రు. గత ఏడాది కంటే ఉత్తమ ఫలితాలు సాధించానికి అటు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎంతో కష్టపడుతున్నారు. సెలవు రోజుల్లో కూడా ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులు వచ్చి విద్యార్థులకు పాఠ్యాంశాలలో ఉండే సమస్యలను నివృత్తి చేస్తున్నారు. దీంతో విద్యార్థులు మరింత చక్కగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించడానికి వీలు కలుగుతుంది.

మంచి ఫలితాలు సాధిస్తాం

గత ఏడాది కంటే ఈ సంవత్సరం మండలంలో పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు వచ్చేందుకు కృషి చేస్తున్నామని, విద్యార్థులకు సెలవు రోజుల్లో ప్రత్యేక తరగతులతో పాటు మధ్యాహ్న భోజనం కూడా అందజేస్తున్నాం.

- ఆర్.ఆనందరావు, ఎంఈవో, వీరఘట్టం

ఏజెన్సీ బంద్‌కు యూటీఎఫ్ మద్దతు

పార్వతీపురం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు సంబంధించి 1/70 అటవీ హక్కుల చట్టాన్ని మార్చాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆదివాసీ గిరిజన సంఘాలు ఏజెన్సీ బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ బంద్‌కు యూటీఎఫ్ మద్దతు తెలియజేస్తుందని రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీ మోహన్‌రావు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, కె.భాస్కరరావు తెలిపారు. వారు ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటికే జీవో నెంబర్3 రద్దు కావడం వల్ల గిరిజన యువత తీవ్రంగా నష్టపోయిందని, దీనివల్ల గిరిజనులు మళ్లీ వందేళ్లు వెనక్కి వెళ్లినట్టయిందని, ఇప్పుడు 1/70 చట్టం రద్దు చేస్తే వారి భూములను కార్పొరేట్లు లాక్కుంటారన్నారు. ఈ బంద్‌కు యూటీఎఫ్ మద్దతు తెలుపుతుందని, ఉపాధ్యాయులందరూ సహకరించాలని వారు కోరారు.

బీజేపీ నాయకుల సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న బీజేపీ శ్రేణులు

బెలగాం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎన్నో ఏళ్లుగా ఢిల్లీ పీఠం కోసం పోరాడి నేడు ఆ కలను ప్రధాని మోడీ నాయకత్వంలో సాధించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు అన్నారు. ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన సందర్భంగా పార్వతీపురంలోని జిల్లా కార్యాలయంలో బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఒకరికొకరు స్వీట్లు పంచుకుంటూ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ విజయం బీజేపీకి ప్రత్యేకమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎస్.సంజీవి, అల్లూరి పేరాజు, పట్టణ అధ్యక్షురాలు వలిరెడ్డి పార్వతి తదితరులు పాల్గొన్నారు.

గెలుపుపై హర్షం

గరుగుబిల్లి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ఎన్నికల ఫలితాలతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ప్రజలకు ఉన్న విశ్వాసం మరోసారి రుజువైందని బీజేపీ నాయకుడు పెదిరెడ్డి గౌరునాయుడు, మండల అధ్యక్షుడు పెదిరెడ్డి అశోక్ అన్నారు. గరుగుబిల్లిలో ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.నరేంద్రమోదీ పట్ల ఢిల్లీ ప్రజలు విశ్వసనీయత చూపి, బీజేపీకి మద్దతు పలికి గెలిపించారన్నారు. సమావేశంలో తుమ్మగుంట రాము, పెంట సురేష్, పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

కురుపాం, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి): అ క్రమంగా మద్యం అమ్మకాలు చేపడుతున్న వారిపై దాడులు జరిపి, మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. అక్రమంగా మద్యం అమ్ముతున్న తురకనాయుడువలస గ్రామానికి చెందిన రెడ్డి జోగమ్మ వద్ద ఏడు సీసాలు, కురుపాంకు చెందిన పొట్నూరుగుంపస్వామి వద్ద 10 సీసాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ దాడులలో ఎస్ఐ జె.రాజశేఖర్ పాల్గొన్నారు.

పారా క్రికెట్ పోటీల్లో సత్తా చాటారు



ట్రోఫీతో భామిని యువత

భామిని, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో నిర్వహించిన మహాఉత్సవ్ టోర్నమెంట్‌లో భామిని మండలానికి చెందిన యువకులు సత్తా చాటారు. రాష్ట్ర స్థాయిలో దివ్యాంగులకు నిర్వహించిన పారా క్రికెట్ టోర్నమెంట్‌లో పార్వతీపురం మన్యం జిల్లా రన్నర్‌గా నిలిచింది. ఈ జట్టులో భామిని మండలం నేరడి గ్రామానికి చెందిన కె.శ్రీను కెప్టెన్‌గా వ్యవహరించారు. ఆయనతో పాటు కె.ఢిల్లేశ్వరరావు, ఎస్.గోవింద, వినోద్‌లు భామి ని మండలానికి చెందిన వారు కావడంతో అభినందించారు.

భూ ఆధార్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

సీతంపేట రూరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య(యూనిక్ ఐడీ) కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏవో శ్రీదేవి ఒకప్రకటనలో తెలిపారు.ఈ నెలాఖరు నాటికి రిజిస్ట్రేషన్ చేసుకుని భూఆధార్ పొందాలని సూచించారు.

రైలు ఢీకొని వృద్ధుడికి గాయాలు

బొబ్బిలి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి రైల్వేప్లాట్‌ఫారం శివారున ఆదివారం పట్టాలు దాటుతుండగా సమతా ఎక్స్‌ప్రెస్ ఢీకొన్న ఘటనలో పక్కి గ్రామానికి చెందిన వృద్ధుడు బంకురు రాము గాయపడ్డాడు. హెచ్‌సీ ఈశ్వర రావు కథనం మేరకు.. విశాఖ నుంచి పార్వతీపురం వైపు వెళ్తున్న సమతా రైలురాకను పట్టాలు దాడుతున్న వృద్ధుడు గమనించలేదు.దీంతో ఆ సమయంలో ఆయన కుడి కాలికి తీవ్ర గాయమైంది. ఆ సమయం ఆయన నోట మాట రాలేదు. రైల్వే హెచ్‌సీ బండారు ఈశ్వరరావు గాయపడిన వ్యక్తికి సంబంధించిన వారెవరైనా తమను సంప్రదించాలని ఫోటోతో సహా సోషల్‌మీడియాలో పోస్టుచేశారు. తెలుసుకున్న బంధువులు పక్కి నుంచి వచ్చారు. దీంతో గాయపడిన వ్యక్తి రాముగా గుర్తించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ యజమానుల సంఘం సంక్షేమ భవనం ప్రారంభం

ఒడిశా

రాయగడ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక ప్రగతిలో రవాణా రంగం కీలక పాత్ర పోషిస్తుందని లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరావు అలియాస్ కొండబాబు అన్నారు. స్థానిక న్యూ కాలనీ కపిలాష్ మార్గంలో ఆధునీకరించిన లారీ య జమా నుల సంఘం కార్యాలయ భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా కొండ బాబును జేకే పరిశ్రమ ఆర్థిక వ్యవహారాల ఉపాధ్యక్షుడు బిశ్వజిత్ ద్వివేది, సేల్స్ డిపా ర్టమెంట్ మేనేజర్ శివప్రసాద్ పట్నాయక్ అభినందించారు. కార్యదర్శి జానకి రాం, యజమానులు పాల్గొన్నారు.

ఫేకర్స్‌లో అగ్ని ప్రమాదం

రాయగడ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జేకే - రాయగడ మార్గంలో ఉన్న ఎ.గోవిందరావుకు చెందిన సత్యం ఫేకర్స్ పరిశ్రమలో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించింది. పరిశ్రమలో ఉన్న కెమికల్స్‌కు నిప్పంటుకోవడంతో మంటలు త్వరితగతిన వ్యాప్తిచెందాయి. అగ్నిమాపక సిబ్బంది రెండు గంటలు శ్రమించి మంటలను అదుపు లోనికి తీసుకొచ్చారు. షార్ట్ సర్క్యూట్ కారణం ప్రమాదం జరిగి ఉండవచ్చని అగ్నిమాపక అధికారి రమేష్‌చంద్ర సాహు తెలిపారు.